టెన్నికాయిటర్ క్రీడాకారుల ఎంపికలు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్ : రాజీవ్ స్టేడియంలో జరిగిన టెన్ని కాయిట్ ఎంపికల్లో సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ జట్లు ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రామారావు హాజరయ్యారు. క్రీడలను టెన్నికాయిట్ ఆడి పోటీలను ప్రారం భించారు. సీనియర్ జట్టు ఈనెల 13 ,14 తేదీల్లో మండపేటలో జరగబోయే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి రామారావు ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండవ విడత యూరియాకు సమయం ఉంది

రైతులు ఆందోళన చెందవద్దు - అదునుకి ఎరువులు అందిస్తాం - జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్

విశాలాంధ్ర - విజయనగరం : జిల్లాలో ఎరువులకు కొరత లేదని, అవసరమైన ప్రాంతాలకు సమయానికి సరఫరా చేస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్పష్టం చేశారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఆదివారం నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో 30 మంది రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. కాగా 25 మంది మంది రైతులు రెండవ విడత ఎరువులు అందడంలేదని ప్రస్తావించగా, కలెక్టర్ స్పందిస్తూ, రెండవ విడత యూరియా వేయడానికి ఇంకా సమయం ఉందని, శాస్త్రవేత్తల సూచన మేరకు పంట వేసిన 35 - 40 రోజుల తరువాత మాత్రమే రెండవ విడత ఎరువులు వేయాలని సూచించారు. ఆ సమయానికి యూరియా అందజేస్తామని, రైతులు ముందుగానే కొనేందుకు రావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎకరాకు మూడు దఫాలుగా 25 కేజీల చొప్పున మాత్రమే యూరియా వాడాలని రైతులకు సూచించారు. రెండవ విడత యూరియా సరఫరాకు ఇంకా సమయం ఉన్నందున మరో 10 రోజుల్లో రెండవ విడత ఎరువులు సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. కొన్ని మండలాల్లో ముందుగా 30 శాతం నాట్లు పడిన రైతులకు, నిర్ణీత సమయంలోనే రెండవ విడత ఎరువులు అందిస్తామని కలెక్టర్ తెలిపారు.

రైతుల సమస్యలపై కలెక్టర్ స్పందన

గరవిడి మండలం వెదుల్లవలస రైతుతో మాట్లాడుతూ 12 మెట్రిక్ టన్నుల ఎరువు పంపించామని తెలిపారు. వంగర మండలం యువిఆర్ పేట రైతుతో మాట్లాడుతూ 20 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని, సోమవారం ఎంఏఓను పంపిస్తామని భరోసా ఇచ్చారు. ప్రైవేటుగా అధిక రేట్లకు ఎరువులు అమ్ము తున్నారని వచ్చిన ఫిర్యాదులపై విజిలెన్స్, పోలీస్ అధికారులతో ముమ్మర తనిఖీలు జరిపించి, అధిక ధరలను అరికడతామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు 411 తనిఖీలు నిర్వహించి, ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 40 లక్షలు రూపాయల విలువ గల 172 మెట్రిక్ టన్న వివిధ రకాల ఎరువులను సీజ్ చేయడం జరి గిందని కలెక్టర్ వివరించారు. జామి మండలం జామి గ్రామ రైతు పొటాషియం కావాలని అడగ్గా, పొటాషియం సిద్ధంగా ఉందని ఎంత కావాలన్నా ఇస్తామని కలెక్టర్ తెలిపారు. గంట్యాడ మండలం రామవరం రైతు మ్యూటేషన్ పెండింగ్ అంశంపై స్పందిస్తూ వెంటనే గంట్యాడ తాసిల్దార్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్య కార్య క్రమంలో వ్యవసాయ శాఖ జేడీ వీటి రామారావు, మార్క్ఫెడ్ డిఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మరో వారం పాటు డయల్ యువర్ కలెక్టర్

విశాలాంధ్ర - విజయనగరం : ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ నేపథ్యంలో, ముఖ్యంగా ఎరువుల సరఫరాపై రైతుల సమస్యలను మరింతగా తెలుసు కోవడానికి, వారి సూచనలు మరియు సలహాలను స్వీకరించడానికి, ఈ కార్యక్రమాన్ని మరో వారం పాటు కొనసాగించాలనే నిర్ణయం కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తీసు కున్నారు. సోమవారం నుండి శనివారం వరకు ప్రతి రోజూ సాయంత్రం 04.00 గంటల నుండి 05.00 గంటల వరకు 9441957315 నంబరుకు రైతులు ఫోన్ చేసి యూరియా సరఫరాలో సమస్యలు, అభి ప్రాయాలను తెలియజేయవచ్చని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

హరికుమార్ సేవలు ఆదర్శప్రాయం

విశాలాంధ్ర - కొత్తవలస : మండలంలోని తుమికాపల్లి గ్రామం వద్ద ఉన్న ఫర్ ద పీపుల్ (ఎఫ్ టీ పి) చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాదు హరికుమార్ నిరుపేద ఒంటరి వృద్ధులకు అందజేస్తున్న సేవలు ఆదర్శ ప్రాయమని కొత్తవలస మేజర్ పంచాయతీ సెక్రటరీ బెహరా శైలజ కొనియాడారు. ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్య క్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామ స్వామి, పంచాయతీ సెక్రెటరీ శైలజ, ట్రస్ట్ సభ్యుల సహకారంతో 45 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసరాలను పంపిణీ చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ హరి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే రిటైర్డ్ ఎంప్లాయ్ రమణ, ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి, ట్రస్ట్ ట్రెజరర్ శ్రావణ్ కుమార్, సభ్యులు గణేష్, నగేష్, బుజ్జి, అడపా కిషోర్, అజయ్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ శ్రీనివాస జూట్ మిల్లు స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు తొలిగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి డిమాండ్

విశాలాంధ్ర - బొబ్బిలి : పట్టణం తారాక రామ కాలనీ వద్ద శ్రీ లక్ష్మీ శ్రీనివాస్ జ్యూట్ మిల్లు స్థలంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి. రెవెన్యూ యంత్రాంగం ఏర్పాటు చేసినటు వంటి ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను తొలగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక తారకరామ కాలనీ వద్ద శ్రీ లక్ష్మీ శ్రీనివాస జూట్ మిల్ భూముల్లో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని సీపీఐ బృందంతో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ శ్రీనివాస జ్యూట్ మిల్లు స్థలంలో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని విషయంలో రెవెన్యూ యంత్రాంగం స్పందించకపోతే ప్రత్యక్షంగా సిపిఐ పార్టీ పేదలతో ఎర్రజెండాలు చేపట్టి ఇలు స్థలాల కోసం భూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న. మునకాల శ్రీనివాస్. సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి కొలుసు వెంకట సత్యనారాయణ. సిపిఐ పట్టణ నాయకులు వెంపల బాబ్జి పాల్గొన్నారు.

రైతులు పక్షాన ప్రభుత్వాన్ని నిలదీద్దాం : పొట్నూరు సన్యాసినాయుడు

విశాలాంధ్ర - గుర్ల : కూటమి ప్రభుత్వం హయాంలో రైతులకు నానాటికి కష్టాలు తప్పడం లేదని... ఒక బస్తా యూరియా కోసం రైతుల పడుతున్న పాట్లే దీనికి నిదర్శనమని వైకాపా మండల పార్టీ అధ్యక్షులు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. రైతు సమస్యల పట్ల ఈనెల 9న మంగళవారం చీపురుపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టనున్న రైతు పోరు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతులకు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు కార్యక్రమం సంబంధించి రైతు పోరు నిరసన పోస్టర్ ను ఆదివారం వైకాపా పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు వైయస్సార్సీపి ఎల్లప్పుడు రైతులకు అండగా ఉంటుందన్నారు వైయస్సార్సీపి హయాంలో అప్పట ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. రైతులకు అన్ని విధాలుగా ఆదుకునేందుకు ఎరువులు, విత్తనాలు సరఫరా చేసేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటిని రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చిందే తప్ప రైతులకు చేసిన మేలు ఏమీ లేదని ఎద్దేవా చేశారు యూరియా కోసం గంటలు లైన్లో నిలబడిన దుస్థితి నెలకొందన్నరు. మొద్దు నిద్రలో ఉన్న ప్రభుత్వాన్ని మల్కొవలసిన సమయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శీర అప్పలనాయుడు, బెల్లాన బంగారునాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, రాష్ట్ర ఆర్టిఐ వింగ్ కార్యదర్శి కెంగువ మధుసూదన్ రావు, జమ్ము స్వామినాయుడు, వరద ఈశ్వరరావు, బోళ్ల మణి, అట్టాడ అప్పలరాజు, యజ్జరోతు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'రైతు పోరు' నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - గజపతినగరం : గజపతినగరం వైసీపీ కార్యాలయంలో ఆదివారం వైసిపి జిల్లా రైతు విభాగ అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు అధ్యక్షతన ఎరువుల బ్లాక్ మార్కెట్ పై రైతు పోరు కార్యక్రమం 9వ తేదీన నిర్వహించనున్నట్లు విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులు ఎరువులుఅందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిపై 9వ తేదీన బొబ్బిలి, విజయనగరం ఆర్డిఓ ఆఫీసుల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. దీనికి రైతులందరూ మరియు నియోజకవర్గంలోని గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ, జామి, దత్తిరాజేరు మండలాల నాయకులు కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అన్నదాత పోరు పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం జడ్పిటిసి గార తౌడు, గంట్యాడ జడ్పిటిసి నరసింహమూర్తి గజపతి నగరం వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, గంట్యాడ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులు పీరు బండి జైహింద్ కుమార్, దత్తిరాజేరు బూత్ కమిటీ అధ్యక్షులు ఎం.ఫణీంద్ర, లీగల్ సెల్ అధ్యక్షులు కే తిరుపతి నాయుడు, పార్టీ నాయకులు కరణం ఆదినారాయణ, పి.మూర్తి, రమేష్, లక్ష్మీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా కర్రి సుధారమ్య

విశాలాంధ్ర - తెర్లాం : తెర్లాం మండలంలో బొమ్మి శ్రీనివాసరావు మేనకోడలు , క్రీస్తు సేసులు కర్రి రాంబాబు ఆంధ్రా యూని వర్సిటీ ప్రొఫెసర్ దయామనిల కుమార్తె డా.కర్రి సుధారమ్య లెక్చరర్ పాలిటెక్నికల్ కాలేజ్ శ్రీకాకుళం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యా యులుగా ప్రభుత్వం ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు మరియు విద్యా శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ల చేతుల మీదుగా అవార్డ్ ప్రధానం చెయ్యటం జరిగినది. ఈ సందర్భంగ కునాయవలసలో ఉన్న కుటుంబ సభ్యులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

రైతులందరికీ అందుబాటులోకి యూరియా

విశాలాంధ్ర - వేపాడ : మండలంలో వరి పంట వేసే వ్యవసాయ రైతులకు అందరికీ యూరియా అందుబాటులోకి తేవడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారిణి ఎం.స్వాతి అన్నారు. ఆదివారం మండలంలోని 29గ్రామ పంచాయతీలలో గ్రామ స్థాయి, మండల స్థాయి వ్యవసాయ శాఖ అధికారులు యూరియా మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరి వేసిన రైతులందరికీ యూరియా సరఫరా చేసేందుకు అందుబాటులో ఉంచటం జరుగుతుందని యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వారం రోజులో యూరియా వస్తుందని రైతులకు తెలియజేశారు. మండలంలో మొత్తం వరి పంట ఉడిచినప్పటి నుండి కోత వరకు 650 టన్నులు యూరియా అవసరం అయితే అందులో మొదటి విడతగా 220 టన్నులు యూరియా అవసరం కావున మండలానికి ఇప్పటి 260 టన్నులు వరకు యూరియా వచ్చిందన్నారు. కాబట్టి రైతులు ఆందోళన చెంది తదుపరి వేయాల్సిన మొతాదు కూడా యూరియా దొరకదని ముందుగా కొని ఉంచుకోవటం వలన కూడా యూరియా కృత్రిమ కొరత ఏర్పడుతుందన్నారు. మొదటి మొతాదుగా ఎకరాకు 20 కేజీలు చొప్పున వేసినట్లయితే యూరియా అందరికి అందుతుందని, 2వ విడతకి మళ్ళీ ప్రతి రైతు సేవ కేంద్రంలో నిల్వ చేయడం జరుగుతుందన్నారు. అలాగే రైతులు నానో యూరియా 500 మిల్లి లీటర్లు బాటిల్ ను ఎకరాకు పిచికారీ చేసినట్లయితే యూరియా బస్తా కంటే 80 శాతం ఎక్కువ పని చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సిబ్బంది, గ్రామ స్థాయి అగ్రికల్చర్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పిడుగు పడి 30 మేకల మృతి

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని కరకవలస పంచాయతీ శివారు గిరిశిఖర మారిక గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగులతో కూడిన వర్షం కురవడంతో పిడుగు పడి 30కి పైగా మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. మారిక గిరిజన గ్రామానికి చెందిన గిరిజనులు నంది రమేష్ తో పాటు మరో ముగ్గురు ఎప్పటిలాగే వారి మేకలను మేతకు తీసుకెళ్లి మేపుతుండగా మేకల మందపై పిడుగులు పడి మృతి చెందడంతో సుమారు రూ.3 లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లింది. మేకలను మేపుకొని జీవనాధారంగా సాగిస్తున్న మేకల మందపై పిడుగులు పడి మృతి చెందడంతో మా జీవనాధారం కోల్పోయామని గిరిజన కుటుంబాలు బోరున విలపిస్తున్నాయి. అలాగే వీటికి ఎటువంటి ఇన్సూరెన్స్ చేయలేదని ప్రభుత్వం ఆదుకోవాలని రోదిస్తున్నారు. అలాగే ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, పిడుగుపాటుకు మేకల మృత్యువాత పడి నష్టపోయిన గిరిజన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పుస్తకంతో నడక.... పుస్తకం కోసం నడక

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్ : విజయనగరం స్థానిక మహాకవి గురజాడ వెంకట అప్పారావు ఇంటి వద్ద ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించు కొని పుస్తకాలను ప్రతి ఒక్కరు నేస్తాలుగా మలుచుకోవాలని డాక్టర్ అబ్దుల్ కలాం స్ఫూర్తితో విజయనగరం రీడ్స్ మరియు విద్యలనగరి చిల్డ్రన్ బుక్ క్లబ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో "వాక్ ఫర్ ద బుక్" పుస్తకం కోసం నడక అనే వినూత్నమైన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ జిల్లా రోటరీ గవర్నర్ డాక్టర్. ఎం.వెంకటేశ్వర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల్లో ఇప్పుడు పుస్తకాలు చదవడం అనేది తక్కువగా కనిపిస్తుందని, అధిక శాతం పిల్లలు, యువత చదవడం లేదని, క్రమేపీ తగ్గిందని చెబుతూ బిల్గేట్స్ గురించి మరియు ప్రపంచ వ్యాప్తంగా పాతిక శాతమే పుస్తకాలు చదువుతున్నారని విషయాన్ని మరియు ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించి నందుకు సంస్థ వ్యవస్థాపకులు ఈశ్వరరావు రేపల్లెను చేస్తున్న కృషి అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యలనగరి చిల్డ్రన్స్ బుక్ క్లబ్ వ్యవస్థాపకులు రేపల్లె ఈశ్వరరావు మాట్లాడుతూ నేటి తరం పిల్లలు పుస్తకానికి దూరం అవుతున్నారని, పుస్తకాల పట్ల ఎక్కువ ఆసక్తి చూపట్లేదని, అనవసరం విషయాలకి దగ్గరవుతూ, అవసరమైన పుస్తకం లాంటి వాటికి దూరమవుతున్నారని, ప్రతి ఒక్క పిల్లలు, ప్రతి ఒక్కరూ పుస్తకాలని తమ నేస్తాలుగా మలుచుకోవాలని, పుస్తకాన్ని మించిన ఉత్తమ గురువు, బోధకుడు, నేస్తం ఆఖరికి వైద్యుడు వేరొకటి లేదని, ప్రతి ఒక్క పిల్లడు తన పాఠశాలకు పోయినప్పుడు సంచిలో పుస్తకం పెట్టుకోవాలని, పుస్తకాన్ని తన నేస్తంగా మార్చుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ విజయనగరం కాపుగంటి శ్రీనివాస్, జిల్లా రచయితల సంఘం జీ.వి శ్రీనివాస్, గురజాడ సమాఖ్య గురజాడ ఇందిరా దేవి, విశాలాంధ్ర పబ్లికేషన్ గుగత అశోక్, జిల్లా గ్రంధాలయ సేవా సంఘం దయానంద్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ విజయనగరం సభ్యులు, విజయనగరం రీడ్స్ చిన్నారులు, విజయనగరం బార్ అసోసియేషన్ ప్రతినిధి నాలుగెస్సుల రాజు పెద్దమజ్జి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శ్రీహరి బాబు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

జియో సేవలు అధ్వానం

విశాలాంధ్ర - మెంటాడ : మండలంలో జియో సేవలు అధ్వానంగా ఉన్నాయి. వేలాది రూపాయలు రీఛార్జ్ చేయడానికి వినియోగదారులు అష్ట కష్టాలు పడి రీఛార్జ్ చేయించుకుంటున్నారు. అయినప్పటికీ జియో సేవలు అనుకున్న స్థాయిలో వినియోగ దారులకు అందించడం లేదు. జియో సేవలు అతి చౌకగా అందించేందుకు జియో సంస్థ ప్రకటనలు చేసినప్పటికీ ఆచరణలో మాత్రం శూన్య మే ప్రస్తుత కాలంలో వినియోగదారులు ఎక్కువ కావడంతో జియో సంస్థ సేవలు అంతంత మాత్రమే జియో సంస్థ మండలాల్లో టవర్లు ఏర్పాటు చేసి వాటి పనితీరు పర్యవేక్షణ లోపా బయిష్టంగా ఉంది. వీటి పరిరక్షణ కింద స్థాయి సిబ్బంది పరిరక్షణ లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జియో సేవలు అలవాటు పడిన వినియోగదారులు వేరే నెట్వర్క్ వెళ్లడానికి ఇష్టం లేక నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంస్థ యాజమాన్యం దృష్టి సారించి వినియోగదారులకు సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.

ఆర్. నారాయణ మూర్తి 'యూనివర్సిటీ పేపర్ లీక్' సినిమా ప్రచారం

విశాలాంధ్ర - రాజాం : స్థానిక వైస్సార్సీపీ టౌన్ కన్వీనర్ పాల వలస శ్రీనివాస రావు, శ్రీమతి పద్మావతిల నివాసంలో దర్శకుడు, నటుడు ఆర్. నారాయణ మూర్తి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. తన స్వీయ దర్శకత్వంలో నటించిన 'యూనివర్సిటీ పేపర్ లీక్' సినిమా త్వరలో విడుదల కానుందని, దాని ప్రచారంలో భాగంగా వారిని కలిసినట్లు నారాయణ మూర్తి తెలిపారు. ఈ కార్య క్రమంలో ఐఏఎస్ గేదెల సురేష్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, తదితరులు ఉన్నారు. ఆర్.నారాయణమూర్తి వచ్చారన్న విషయం తెలుసుకుని ఆయనను చూసేందుకు రాజాం ప్రాంత అభిమానులు పాలవలస శ్రీనివాసరావు నివాసానికి చేరుకున్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని బానాది గ్రామానికి చెందిన కోట్ని రూపా దేవికి సీఎం సహాయనిది చెక్కును ఎమ్మెల్యే కోళ్ళ కుమారి చేతుల మీదుగా అందిం చారు. ఆదివారం ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి తన క్యాంప్ కార్యాలయం లక్కవరపుకోటలో బానాది గ్రామానికి చెందిన కోట్ని రూపాదేవికి ముఖ్యమంత్రి సహాయనిధికి చెందిన రూ.1 లక్ష 75 వేల165 రూపాయలు విలువ చెక్కును అందించగా రూపా దేవి ఆమె కుటుంబ సభ్యులు ఆపదలో ఉన్న మమ్మల్ని ఆదుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గోంప వెంకటరావు, ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ, మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, టిడిపి నాయకులు వేచలపు రామకృష్ణ, నిరుజోగి బంగారునాయుడు భాజంకి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్ఫార్మర్ చోరీ

విశాలాంధ్ర - భోగాపురం : మండలంలోని సుందరపేట గ్రామంలో ట్రాన్స్ఫార్మర్ దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన రైతు కోలా విశ్వేశ్వరరావు ఆదివారం తీర్థ యాత్ర నుండి తిరిగి వచ్చి మధ్యాహ్నం తన పొలాన్ని పరిశీలించగా ట్రాన్స్ఫార్మర్ కనిపించలేదు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్ఫార్మర్ దొంగిలించినట్టు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై రైతు విశ్వేశ్వరరావు పోలీసులకు, విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర - బొబ్బిలి : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో విజయనగరం జిల్లా నుంచి 76 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అందులో, బొబ్బిలి నియోజక వర్గానికి చెందిన 12 మంది ఉపాధ్యాయులను గౌరవ శాసనసభ్యులు ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) ఆదివారం బొబ్బిలి కోటలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ, మన నియోజకవర్గానికి చెందిన ఉపాధ్యా యులను ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో ఎంపిక చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, వారిని సన్మానించే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మరియు విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు రౌతు రామ్మూర్తి ఉపాధ్యాయుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కౌలువాడలో వైద్య శిబిరం

విశాలాంధ్ర - భోగాపురం : మండలంలో కౌలువాడ పంచాయతీ యాతపేటలో శనివారం జ్వరంతో వివాహిత మైనపు మంగ మృతి చెందిన ఘటనపై వైద్య శాఖ అప్రమత్త మైంది. ఆదివారం కౌలువాడలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. జిల్లా మెడికల్ హెల్త్ అధికారి జీవనరాణి, జిల్లా మలేరియా అధికారి మణి గ్రామంలో పర్యటించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, జ్వరాలతో బాధపడుతున్న వారిని పరిశీలించి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీవనరాణి మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నాం. వచ్చే పది రోజులు కౌలువాడ పరిధిలో వైద్యశిబిరాలు కొనసాగించి ప్రజలకు వైద్యసేవలు అందిస్తాం. జ్వరంతో బాధపడుతున్న వారు తప్పనిసరిగా వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ సత్యనారాయణ, పోలిపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి లక్ష్మణ, సిబ్బంది పాల్గొన్నారు.

అలమండలో ఘోర రోడ్డు ప్రమాదం

- మద్యం మత్తులో కారుతో మూడు బైకులను ఢీకొన్న వైనం - ఇద్దరు మృతి.. ఒకరు పరిస్థితి ప్రమాదకరం

విశాలాంధ్ర - జామి : మండలంలోని అలమండ పెట్రోల్ బంకు వద్ద ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మద్యం మత్తులో కారును అతి వేగంగా నడపడంతో పాటు మూడు బైకులను ఢీకొనడంతో బైకులు నడుపుతున్న ముగ్గురిలో ఇద్దరు మరణించగా, మరొకరు మృత్యువు తో పోరాడుతున్నారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని అలమండలో గుడివాడ రాజేశ్వరరావు పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో కంటి కాపల్లి నుంచి విజయనగరం వైపు ఓ కారు వేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న మూడు బైకులను వరుసగా ఢీకొట్టింది. అనంతరం సమీపంలోని గోడకు ఢీకొట్టగా కారులో ఎయిర్ బెలూన్ ఓపెన్ కావడంతో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. మోటార్ సైకిల్ పై వస్తున్న ముగ్గురు యువకులు తీవ్ర గాయాల పాలవడంతో వారిలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు అపస్మారక స్థితిలో ఉన్నాడు. సంఘటన గుర్తించిన స్థానికులు హుటాహుటిన అక్కడికి వచ్చి సహాయ చర్యలు చేపట్టారు. మృతి చెందిన వారిలో ఒకరు చెరుకుపాలెం గ్రామానికి చెందిన బోని సాగర్ గా, మరొకరు బీమాలి గ్రామానికి చెందిన గుళ్ళపల్లి సురేష్ గా గుర్తించారు. అపస్మారక స్థితిలో ఉన్న బీమాలికి గ్రామానికి చెందిన మిడతాన సూర్యప్రకాశరావును 108 వాహనం ద్వారా విజయనగరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ప్రమాదానికి కారణం కారు నడుపుతున్న డ్రైవర్ మద్యం సేవించడమేనని స్థానికులు చెబుతున్నారు. సంఘటన సమాచారం తెలుసుకున్న జామి పోలీసులు ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటున్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

విశాలాంధ్ర - తెర్లాం : తెర్లాం శాఖ గ్రంధా లయంలో ఆదివారం చదవడం మాకిష్టం సందర్భంగా విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి అని స్థానిక గ్రంథాలయాధికారి సిహెచ్. కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు డా. జాకీర్ హుస్సేన్, అల్లా ఉద్దీన్ అద్భుత దీపం మరియు నీతి కథలు మరియు పద్యములు, గద్యములు చెప్పడం చదవడం జరిగింది. చిల్డ్రన్స్ క్లబ్ లో భాగంగా విద్యార్థులచే వార్త పత్రికలు దిన పత్రికలు చదివించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - భోగాపురం : మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. సవరవిల్లి గ్రామానికి చెందిన బుత్తల లక్ష్మణ్ (40) శనివారం రాత్రి బహిర్భూమి కని ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెతికారు. అతని ఆచూకీ లభించలేదు. ఆదివారం మధ్యాహ్నం గ్రామ శివారులోని ఎర్ర చెరువులో లక్ష్మణ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించి బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సామాజిక ఆసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు ఎరకయ్య స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పు చేస్తే తొలగిస్తే.. రెడ్‌బుక్ రాజ్యాంగం అంటారా..!

మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి దనియాల

విశాలాంధ్ర –జామి: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఎన్నింటి జగదీష్‌ను పలు అవకతవల ఆరోపణలపై అధికారులే స్వయంగా విచారణ చేసి తొలగిస్తే దానిని రెడ్‌బుక్ రాజ్యాంగం అని ఆరోపించడం భావ్యం కాదని మండల టీడీపీ ప్రధానకార్యదర్శి దనియాల పైడిరాజు, బీమసింగి ఎంపిటిసి దనియాల హైమావతిలు అన్నారు. ఆదివారం వారు విలేఖరులతో మాట్లాడుతూ గతంలో ఇదే పోస్టులో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసిన దనియాల చరణ్‌ను ఎటువంటి ఆరోపణలు లేకపోయినా, కేవలం రాజకీయ కక్ష్యతో నిర్దాక్ష్యణంగా తొలగించిన విషయం మరిచిపోయారా అని ప్రశ్నించారు. ఆనాడు రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేశారా అని అన్నారు. ప్రభుత్వ విదులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు పలు ఆరోపణలపై పూర్తిస్థాయిలో అధికారులు విచారణ చేసి తొలగింపు నిర్ణయం తీసుకున్నారని ఈవిషయాన్ని అధికారులే స్పష్టంగా చెబుతున్నారని అన్నారు. ఇందులో రాజకీయంగా ఎటువంటి వత్తిళ్ళు లేవని గుర్తించాలన్నారు.

పశువైద్యశాలలకు లంచ్ టైంలో తాళం వేస్తా...

– అవసరమైతే టైమింగ్ బోర్డు కూడా పెడతా...
– గోవిందపురం పశు వైద్యాధికారిణి రాజరాజేశ్వరి
నిర్లక్ష్యానికి ఇది పరాకాష్ట

విశాలాంధ్ర – పూసపాటిరేగ: మండలంలోని పశు వైద్యశాలలు రైతులకు, పశుపోషకులకు ఆపద్బాంధవంలా ఉండాలి. కానీ గోవిందపురం పశువైద్యశాలలో జరిగిన తాజా సంఘటనలు చూస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. మధ్యాహ్నం రెండు గంటల 45 నిమిషాలకు పశువైద్యశాల తాళం వేసి ఉండగా, వివరణ కోరిన వారితో పశువైద్యాధికారి డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి ప్రవర్తించిన తీరు చూస్తే నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది."లంచ్ టైమ్‌లో తాళం వేస్తాం, దానికి బోర్డులు కూడా పెడతాం" అని చెప్పడం ఒక ప్రభుత్వ అధికారి నోటి మాటేనా అన్న సందేహం కలుగుతోంది. ప్రజల కోసం తెరిచి ఉండాల్సిన కార్యాలయాన్ని, తాము నచ్చినట్టుగా మూసివేయడం ఉద్యోగ ధర్మానికే విరుద్ధం.ఇక గోవిందపురం పరిధిలో పది రోజుల్లో గుర్తుతెలియని వ్యాధితో సుమారుగా 8,000 కోళ్లు చనిపోతే, రైతులు ఏ దుస్థితిలో ఉన్నారో అర్థం చేసుకోవాలి. కానీ పరిస్థితిని అంచనా వేసి, చర్యలు సూచించాల్సిన వైద్యాధికారి, "ఇక మిగిలిన 14 కోళ్లు చనిపోతే పాతిపెట్టమన్నా" అని నిర్లక్ష్యంగా వ్యాఖ్యానించడం బాధాకరం. కారణం ఏమిటో పరిశీలించకుండానే "అధిక వర్షాల వల్లే చనిపోయాయి" అని చెప్పడం కూడా ప్రజల ఆవేదనను మరింత పెంచింది. వైద్యాధికారుల నిర్లక్ష్యానికి పై అధికారులు ఎందుకు కళ్ళు మూసుకున్నారు? స్థానికంగా నివసించాలని నిబంధన ఉన్నప్పటికీ, పట్టణాల నుండి వచ్చి వెళ్ళిపోతూ, నచ్చిన సమయంలో ఉద్యోగం చేస్తున్నారు. ఎవరూ పట్టించుకోవడం లేదు. "వేటగాడు చేత కాని వాడయితే లేడీ ఎదురుగా వచ్చి డాన్స్ చేసింది" అన్న సామెతలా ఉంది అధికారుల పరిస్థితి. రైతులు నష్టపోయినా, ప్రజలు సమస్యలతో పోరాడినా, ఈ నిర్లక్ష్యం కొనసాగితే పశువైద్యశాలలపై ప్రజల విశ్వాసం పూర్తిగా చెదిరిపోతుంది. ఈ వైద్యాధికారుల మీద నమ్మకం లేక పౌల్ట్రీ ఫార్మ్ రైతులు నేరుగా గవర్నమెంట్ వైద్యాధికారులను సంప్రదించలేకపోతున్నారు. ఇప్పటికైన పై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. లేకపోతే పశువైద్యశాలల్లో రైతులకు సరైన వైద్యం అందే పరిస్థితి కనిపించడం కనిపించడం లేదు. ఈ విషయంపై పశు వైద్యశాలల ఏ.డి చక్రవర్తిని ప్రశ్నించగా విషయం ఇంకా నా దృష్టికి రాలేదని తెలుసుకుని తగు చర్యలు తీసుకుంటానని సమాధానం ఇచ్చారు.

బ్యాంక్ సేవలపై బైక్ ర్యాలీ

విశాలాంధ్ర– మెంటాడ: సెంట్రల్ బ్యాంక్ ఆదేశాలతో ఆదివారం ఉదయం మండల కేంద్రమైన మెంటాడలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ బ్యాంకు ఏజీఎం అరసాడ శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ చల్లపేట సెంట్రల్ బ్యాంక్ బ్రాంచిలో డిపాజిట్లు చేస్తే మిగతా బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఇవ్వడం జరుగుతుందని, ఈ బ్యాంకులో రైతులకే కాక మిగతా ఖాతాదారులకు అనేక రకాల రుణాలపై అతి తక్కువ వడ్డీతో ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు. మండల ప్రజలకు సెంట్రల్ బ్యాంకు విశిష్టతను, బ్యాంకు సేవలు పనితీరు పై బైక్ ర్యాలీపై మండల ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంక్ అభివృద్ధికి యువత, ఖాతాదారుల కు అవగాహన కల్పించేందుకు వివిధకార్యక్రమాలు కృషి చేయడం జరుగుతుందని అన్నారు.

తక్కువ వడ్డీకే రుణాలు, డిపాజిట్లపై అధిక వడ్డీ ఇచ్చిన ఏకైక బ్యాంకు సెంట్రల్ బ్యాంక్ అని ఆయన కొనియాడారు. మన బ్యాంకు డిసిసిబి అనే నినాదంతో గ్రామంలో బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లపేట బ్రాంచి మేనేజర్ పాండ్రంకి శ్రీనివాసరావు, మెంటాడ పీఏసీఎస్ సీఈవో వెంపడాపు ప్రసాదరావు, చల్లపేట బ్రాంచి సూపర్వైజర్ నారాయణరావు, పిఎసిఎస్ సిబ్బంది వతివాడ విశ్వేశ్వరరావు, అరసాడ విజయ్ మూర్తి, పి చిరంజీవి, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ వ్యవహారంలో మైనర్ బాలిక మృతి

విశాలాంధ్ర – చీపురుపల్లి: ప్రేమ వ్యవహారంలో చీపురుపల్లి పట్టణానికి చెందిన ఓ మైనర్ బాలిక మృతి చెందినట్లు చీపురుపల్లి డి.ఎస్.పి.ఎస్ రాఘవులు తెలిపారు. ఈ మేరకు వివరాలు ఎలా ఉన్నాయి. గరివిడి మండల బాగువలస గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలుడుతో చీపురుపల్లి పట్టణానికి చెందిన ఓ మైనర్ బాలిక గత కొద్ది సంవత్సరాలుగా ప్రేమలో పడింది. వీరు ఇరువురు చీపురుపల్లిలో వల్ల గల ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుచున్నారు. మీరు ఇరువురు గత కొంత కాలంగా ప్రేమించుకున్నారు. మైనర్ బాలిక గర్భవతి ఆయన కారణంగా తీసుకున్న మందులు ప్రభావంతో మైనర్ బాలిక అపస్మారక స్థితికి చేరుకుంది. అపస్మారక స్థితిలో చేరుకున్న మైనర్ బాలికను తల్లి చికిత్స నిమిత్తం చీపురువల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్ళగా పరిస్థితి విషమించటంతో కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్ నందు చికిత్స పొందుతూ మైనర్ బాలిక ఆదివారం ఉదయం తుది శ్వాస విడిచినట్లు డీఎస్పీ తెలిపారు.

అక్రమ మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ శాఖ స్పెషల్ డ్రైవ్

విశాలాంధ్ర – రాజాం: రాజాం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికారిక మద్యం అమ్మకాలు (బెల్ట్ షాపులు) బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై మూడు రోజుల స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న (6) ఆరుగురిపై కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి 55 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

అలాగే, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న(3) ముగ్గురిపై కూడా కేసులు పెట్టడం జరిగింది. ఇంత వరకు 119 మందిపై కేసులు, బెల్ట్ షాపులకు సంబంధించి ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటివరకు, బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న 106 మందిపై కేసులు నమోదు చేసి, 911 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అంతే కాకుండా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 13 మందిపై కేసులు పెట్టడం జరిగింది.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బెల్ట్ షాపులు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

9న వైసీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు

విశాలాంధ్ర – చీపురుపల్లి: వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపుమేరకు 9వ తేదీన చీపురుపల్లిలో అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులు, పార్టీ కార్యకర్తలు, రావాలని గరివిడి వైయస్సార్ సిపి పార్టీ అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి "అన్నదాత పోరు" పోస్టర్ ను ఆవిష్కరించారు.



అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సమస్యలపై నిద్రపోతుందని అన్నదాతల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న ఈ ప్రభుత్వానికి కళ్ళు తెరిపిద్దామన్నారు. రైతులకు యూరియా కూడా అందించలేని ఒక అసమర్థత పాలన చూస్తున్నాం. బ్లాక్ మార్కెట్లో కూటమి నేతలు కోట్లు దండుకుంటున్నారన్నారు. అబద్ధపు హామీలు నమ్మి ఓట్లేసిన పాపానికి కూటమి ప్రభుత్వంలో రైతాంగం రోడ్లెక్కవలసిన పరిస్థితి దాపురించిందన్నారు. ఎన్నడూ లేని విధంగా వేకువజమున 5 గంటల నుంచి క్యూ లైన్ లో నిల్చునే పరిస్థితి వచ్చింది. యూరియా కోసం రైతన్నలు అష్ట కష్టాలు పడుతున్నారన్నారు. పస్తులతో ఎరువు కోసం అన్నం పెట్టే రైతన్నలు చూసి సభ్య సమాజం తలదించుకోవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకూ వైయస్సార్ పార్టీ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు,పార్టీ కార్యకర్తలు పాల్గొవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములు, యలకల అప్పలనాయుడు, వల్లి రెడ్డి లక్ష్మణ, బమ్మిడి కార్తీక్, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 1500 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు

జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

విశాలాంధ్ర – అనకాపల్లి (కశింకోట):జిల్లాలో ప్రస్తుతం 1500 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటు లో ఉన్నాయని అందులో రైతు సేవా కేంద్రాల వద్ద 1050 మెట్రిక్ టన్నులు ఉండగా, ప్రైవేట్ దుకాణాలలో 450 మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. రెండు రోజుల్లో రైతు సేవ కేంద్రాలు, ప్రైవేట్ దుకాణాల ద్వారా పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం కశింకోట మండలం వెదురు పర్తి గ్రామం రైతు సేవ కేంద్రంలో రైతులకు ఎరువుల పంపిణీ జరుగుతున్న తీరును కలెక్టర్ విజయ క్రిష్ణన్ పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే చెప్పాలని రైతులను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ యంత్రాంగం యూరియా లభ్యత కొరకు ప్రతి గ్రామంలో తహసీల్దార్, ఎంపీడీఓ వ్యవసాయ అధికారులతో మూడు బృందలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని



యూరియా సరఫరా నిరంతరంగా కొనసాగుతోందని, ఎవరూ ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని. సరఫరాలో ఎలాంటి లోపాలు చోటు చేసుకోకూడదని అధికారులను కలెక్టర్ సూచించారు. రైతులు తప్పని సరిగా తమ వేలిముద్రలు నమోదు చేసుకుని ఆధార్ అధీకృత విధానం ద్వారా యూరియా కొనుగోలు చేయాలని కలెక్టర్ సూచించారు. అధికంగా ఎరువులను వినియోగిస్తే దోమపోటు పొడతెగులు వంటి చీడ పీడల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నదని, కావున నిర్దేశించిన మోతాదులోనే యూరియాను వినియోగించుకోవాలని అన్నారు. రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా అందుబాటులో తెస్తున్నామని, రానున్న రోజుల్లో సమృద్ధిగా మరింత యూరియా ఎరువుల సరఫరా జరుగుతున్నదని తెలిపారు. కనుక రైతులు ముందస్తుగా కొనుగోలు చేయవద్దని మనవి చేశారు. అధిక ధరలకు యూరియా అమ్మితే సమీపంలో ఉన్న మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలని, అధిక ధరలకు విక్రయించిన వారిపై ఎరువుల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమం లొ అనకాపల్లి ఆర్డీఓ షేక్ అయిషా, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు,రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

వ్యక్తికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర – రామభద్రపురం: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయని స్థానిక పోలీస్ స్టేషన్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అప్పారావు తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం మండల కేంద్రానికి చెందిన మామిడి పాక వెంకటరాజు రామభద్రపురం నుంచి బొబ్బిలి వెళ్లి తిరిగి వస్తుండగా ఆదివారం మధ్యాహ్నం చిన్నమ్మ తల్లి గుడి వద్ద పరవాడ నుంచి గుమ్మలక్ష్మీపురం బుల్లెట్ వాహనంపై వెళుతున్న శివ అతనిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకట రాజు కాలు విరిగిపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

రెండు గ్రామాల్లో ముదురుతున్న శ్మశాన వివాదం

ఏకాభిప్రాయానికి రావాలన్న అధికారులు
చర్చలకు సర్పంచ్ సహా జోడిమెరక గ్రామస్తులు దూరం
ఆక్రమణలో 5 ఎకరాల శ్మశాన స్థలం..?

విశాలాంధ్ర – కొత్తవలస : వారంతా ఒకే సామాజిక వర్గానికి చెందిన ప్రజలు... రెండు గ్రామాల్లోనూ బంధువులు, చుట్టరికాలతో ముడిపడి ఉన్న బాంధవ్యాలు నేడు స్మశాన స్థల వివాదంతో భగ్గు మంటున్నాయి... గ్రామాల్లో ఇటీవల చోటు చేసుకున్న పరిస్థితులు, వరుస మరణాల ప్రభావం స్మశాన స్థలంపై చూపింది. దీంతో ఇటీవల మృతి చెందిన జోడుమెరక నివాసైన ఓవ్యక్తిని దహనపరచడంపై తమ్మన్నమెరక గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేసి అడ్డుకున్నారు. అధికారుల చొరవతో తమ్మన్నమెరక స్మశానంలో ఖననం చేసి తాత్కాలికంగా వివాదానికి తెర వేసినప్పటికీ గ్రామంలో మాత్రం పరిస్థితి చక్కబడలేదు. రెండు గ్రామాలప్రజలు పంచాయతీ పెద్దలసమక్షంలో చర్చలు జరిపి ఏకాభిప్రాయానికి రావాలని అధికారులు సూచించారు. దీంతో ఆదివారం అప్పన్నదొరపాలెం గ్రామంలో రెండుగ్రామాలకు చెందిన ప్రజలు చర్చలకు హాజరుకావాలని గ్రామ పెద్దలు తెలియజేశారు. తమ్మన్నమెరక గ్రామప్రజలు చర్చలకు హాజరైనప్పటికీ, జోడుమెరక గ్రామస్థులతో పాటూ పంచాయతీ సర్పంచ్ జోడు రాములమ్మ సైతం హాజరుకాలేదని, ఈ అంశాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలంటూ పంచాయతీ ప్రజలు అయోమయంలో పడ్డారు.

ఇదిలా ఉంటే తమ గ్రామంలోని స్మశానంలోకి మారెవరూ రావడానికి వీల్లేదని తమ్మన్నమెరక గ్రామ ప్రజలు తెగేసి చెప్తున్నారు. మరోవైపు జోడిమెరక గ్రామస్తులు గతంలో వినియోగించిన సర్వే నంబరు 11లో గల ప్రభుత్వ భూమి గెడ్డ పోరంబోకు విస్తీర్ణం సుమారు 5ఎకరాల భూమిని ప్రయివేటు వ్యక్తులు ఆక్రమించి గోడను నిర్మించారని, ఈ అంశంపై అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదనే విమర్శలు పంచాయతీ ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. అయితే చర్చకు హాజరుకాకపోవడంపై సర్పంచ్ జోడు రాములమ్మ వద్ద ప్రస్తావించగా సమస్య గల తమ్మన్నమెరక, జోడుమెరక మధ్యలోగల జగనన్న కాలనీ వద్ద చర్చలు ఏర్పాటుచేయాలని తాను ముందే చెప్పినా అందుకు విరుద్ధంగా అప్పన్నదొరపాలెంలో ఏర్పాటుచేశారని, తాము వివాదాలకు దూరంగా ఉండాలానే ఉద్దేశ్యంతోనే చర్చలకు హాజరు కాలేదని స్పష్టం చేశారు. పూర్వం నుంచి తమ్మన్నమెరకలోనే రెండు గ్రామాల్లో మరణించిన వారిని ఖననం చేసేవారమని, అధికారులు స్పందించి తమ రెండుగ్రామాల స్మశాన వివాదాన్ని కొలిక్కి తీసుకురావాలని ఆమె కోరారు.

పాఠశాలలకు ఐడిబిఐ బ్యాంక్ సీలింగ్ ఫ్యాన్లు వితరణ

విశాలాంధ్ర – విజయనగరం: నగరంలో ఉన్న 3 నగరపాలక సంస్థ పాఠశాలలకు ఐడిబిఐ బ్యాంక్ యాజమాన్యం 1,75,000 రూపాయల వ్యయంతో వివిధ ఉపకరణాలను మంజూరు చేసింది.

విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అభ్యర్థన మేరకు ఐడిబిఐ బ్యాంకు వారు సీలింగ్ ఫ్యాన్లు, ట్యూబ్లైట్లు, మైక్రోస్కోప్‌లను ఆదివారం అందజేశారు. నగరపాలక సంస్థ పాఠశాలలలో గత కొన్నాళ్ళుగా ట్యూబ్లైట్లు, సీలింగ్ ఫ్యాన్లు లేక విద్యార్థులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నట్లు కమిషనర్ దృష్టికి వచ్చింది. కనీస సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించలేకపోతున్నారన్న విషయాన్ని గుర్తించిన కమిషనర్ పల్లి నల్లనయ్య ఐడిబిఐ బ్యాంక్ యాజమాన్యం వారికి విషయాన్ని తెలియజేసి ఉపకరణాలు అందజేయాలని కోరారు. దీంతో స్పందించిన బ్యాంక్ యాజమాన్యం సి ఎస్ ఆర్ ఇనిషియేటివ్ కార్యక్రమంలో భాగంగా ఈ మేరకు ఉపకరణాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కంటోన్మెంట్ పాఠశాలకు 44,750 వ్యయంతో 25 సీలింగ్ ఫ్యాన్లు, 25 ట్యూబ్లైట్లను, కస్పా హైస్కూల్ పాఠశాలకు 48,250 రూపాయల వ్యయంతో 50 ట్యూబ్ లైట్లు, 25 సీలింగ్ ఫ్యాన్లు, అలాగే బిపిఎం హైస్కూల్ కు 82,000 వ్యయంతో 25 సీలింగ్ ఫ్యాన్లు, 25 ట్యూబ్ లైట్లు, ఒక ఎలక్ట్రికల్ బైనాక్యులర్ మైక్రోస్కోప్ ను అందజేశారు. ఈ నేపథ్యంలో తాము అభ్యర్థించిన వెంటనే పాఠశాలలకు సహృదయంతో ఉపకరణాలు అందజేసిన ఐడిబిఐ బ్యాంక్ యాజమాన్యానికి, ప్రతినిధులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

యూరియా, ఎరువుల కొరతపై వైసీపీ 'అన్నదాత పోరు'

విశాలాంధ్ర – బొబ్బిలి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సకాలంలో రైతులకు యూరియా ఎరువులు అందించడంలో తీవ్రంగా విఫలం చెందిందని అందుకు నిరసిస్తూ ఈ నెల 9 న రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యా లయాలు వద్ద అన్నదాతలకు అండగా వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నిలిచే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించబోయే అన్నదాత పోరు కార్యక్రమంను జయప్రదం చేయాలని కోరుతూ గోడ పత్రికలను ఆవిష్కరించారు.



ఈ సందర్భాంబంగా మాజీ ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూరాష్ట్రంలో యూరియా కోసం, ఎరువుల కోసం రైతులు గత కొన్ని నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు ప్రభుత్వం మొద్దునిద్రపోతోందా...? ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతులు సంక్షోభంలో ఉంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు గానీ, వ్యవసాయ మంత్రిగా అచ్చెన్నాయుడుకు గానీ ఏ మాత్రం చీమకుట్టినట్లయినా లేదు. రైతులు క్యూలో నిలబడితే దాన్ని బఫే భోజనంతో పోల్చిన అచ్చెన్నాయుడు అసలు మంత్రి పదవిలో కొనసాగేందుకు అర్హుడేనా...? రైతులు ఇబ్బందులు ఉంటే ఆయనకు భోజనం గుర్తుకు రావడం దౌర్భాగ్యంని ఆరోపించారు. మార్క్ ఫెడ్‌కు ఇవ్వాల్సిన 50శాతం ఎరువులను తగ్గించి, ప్రైవేటుకు కేటాయించడం అత్యంత దుర్మార్గ చర్యలు, ప్రైవేటుకు ఇచ్చిన యూరియాను బ్లాక్ చేసి, బస్తా రూ.270 ఉంటే దాన్ని రూ.450-600కు అమ్ముకున్నారని ఆరోపించారు. రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

గోవిందపురం వద్దే ప్రయాణికులను దించేసిన ఆర్టీసీ సిబ్బంది

విశాలాంధ్ర – పూసపాటిరేగ: చింతపల్లి వెళ్లాల్సిన బస్సును గోవిందపురం వద్దే నిలిపివేసి ప్రయాణికులను దింపేసిన ఘటనపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం ఏడు గంటలకు చింతపల్లి వెళ్లే ఆఖరి బస్సును గోవిందపురం వరకు మాత్రమే నడిపి, వినాయక నిమజ్జనం జరుగుతుందని కారణం చూపుతూ సిబ్బంది అక్కడే ప్రయాణికులను దించేశారు.

ప్రజలు వినాయక ఊరేగింపు ట్రాక్టర్లో జరుగుతున్నా రెండు మూడు నిమిషాల ఆలస్యంగా అయినా బస్సు దారి ఇస్తే సరిపోతుంది. గోవిందపురం ప్రజలకు బస్సును అడ్డుకోవాలన్న ఉద్దేశం లేదు. శుక్రవారం ఊరేగింపు అప్పుడు బాగానే సైడ్ నుంచి వెళ్లిన ఆర్టీసీ బస్సు శనివారం ఎందుకు వెళ్ళదో వాళ్లకే తెలియాలి. దాన్ని సాకుగా చూపించి మధ్యలోనే బస్సు వెనక్కి తిప్పేశారు" అని తీవ్రంగా విమర్శించారు. ఇది తొలిసారి కాదని, ఇంతకు ముందు శ్రీకృష్ణాష్టమి రోజున కూడా మధ్యాహ్నం ట్రిప్పును ఇదే విధంగా గోవిందపురం వద్దనే ఆపివేయడం జరిగిందని గుర్తుచేశారు. ప్రయాణికులకు పదే పదే ఇలాంటి ఇబ్బందులు కలిగిస్తున్న ఆర్టీసీ యాజమాన్యంపై వెంటనే విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని డిపో అధికారులను ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

40 ఏళ్లు దాటిన ప్రతి మహిళ గర్భాశయ, రొమ్ము పరీక్షలు చేయించుకోవాలి

– టీడీపీ నాయకులు గూటూరు శ్రీనివాసరావు

విశాలాంధ్ర – పాయకరావుపేట: 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్క మహిళ గర్భాశయ, రొమ్ము పరీక్షలు చేయించుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు గూటూరు శ్రీనివాసరావు తెలిపారు. మహిళ ఆరోగ్య వికాస్, పాయకరావుపేట, తుని వికాస తరంగిణి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గూటూరు శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో, దేవాంగల సంఘం నాయకుల సమక్షంలో మహిళలకు ఉచిత గర్భాశయ, రొమ్ము పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గూటూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ముందస్తు పరీక్షలు చేయించుకోక పోవడం వల్లే తన తల్లిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర మహిళలు ఏడాదికి ఒకసారి ఇటువంటి పరీక్షలు చేయించుకొని, అవసరమైన వాళ్లు వ్యాధి ముదరకుండానే మందులు వాడాలని తెలిపారు. మమతా హాస్పిటల్ డాక్టర్ పుష్ప ఆధ్వర్యంలో మహిళలకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మలిపెద్ది వెంకటరమణ, చేనేత సంఘం మేనేజర్ జి. నాగేశ్వరరావు, బళ్ళ దొంగబాబు, యర్ర నరేష్, బూడిద గౌరీ శంకర్, మాతి నాయుడు, అనంతలక్ష్మి, రమ్య, మాధవి, ఆండాల్ రిందాదేవి, శైలజ, వెంకటలక్ష్మి, రాణి, సూర్య, శ్రీదేవి, రమాదేవి, స్వప్న, దేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లి మంగరాజు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర –సబ్బవరం: మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ జనసేన పార్టీ నాయకులు, విశాఖ జిల్లా ప్రోగ్రాం కమిటీ మెంబర్ పల్లి మంగరాజు జన్మదినం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.

ఈ జన్మదినం వేడుకలకు ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు పాల్గొని ఆయన చేతుల మీదుగా కేక్ కటింగ్ చేయించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు కర్రి కనకరాజు, బలిరెడ్డి అప్పారావు, ఇందల రమణ, బర్నికాన సాయినాధనారావు, మామిడి శంకర్రావు,సింగంపల్లి శ్రీనివాస్,కొల్లి కృష్ణ,బంతికోళ్ళ పద్మ,గవర అప్పారావు,కనుగుద్ది కనకరాజు,గవర సత్యనారాయణ,కరణం పండు, కాపుశెట్టి సురేష్ పాల్గొన్నారు.

పారిపోయిన రిమాండ్ ఖైదీల అరెస్టు: ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాంధ్ర – చోడవరం: చోడవరం పోలీస్ స్టేషన్ పరిధిలో సబ్ జైలులో రిమాండ్ లో వున్న నిందితులను పట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో తెలియజేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 05 సాయంత్రం 4 గంటల సమయంలో, చోడవరం సబ్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఏ1. నక్క రవి కుమార్, ఏ 2. బెజవాడ రాములు, హెడ్ వార్డర్ వాస వీర్రాజును ఇనుప సుత్తితో దాడి చేసి, గేటు తాళపు చెవులు లాక్కొని జైలు నుండి పారిపోయారన్నారు. ఈ క్రమంలో ఏఎస్సై కృష్ణమూర్తికు చెందిన మొబైల్ ఫోన్‌ను కూడా దొంగిలించినట్లు తెలిపారు. జైలు సిబ్బంది వీధుల్లో నిర్లక్ష్యం కారణంగా రిమాండ్ ఖైదీలు సబ్ జైలు నుండి తప్పించుకున్నారన్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే అనకాపల్లి జిల్లా పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేసి, వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం, జిల్లా లో వాహన తనిఖీలు చేసినట్లు తెలిపారు. పోలీసులు జారీ చేసిన లుకౌట్ నోటీసుల ఆధారంగా, ఈ నెల 06న సాయంత్రం 6.00 గంటల సమయంలో, విశాఖపట్నం సిటీ టాస్క్ ఫోర్స్ పోలీసులు గొల్లలపాలెం జంక్షన్, ఎస్.బి.ఐ. ప్రాంతం వద్ద ఇద్దరు

నిందితులను పట్టుకొని, చోడవరం పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. ఆ సమాచారంపై చోడవరం ఇన్స్పెక్టర్ పి.అప్పలరాజు, తన సిబ్బందితో కలిసి సిటీ టాస్క్ ఫోర్స్ కార్యాలయం నుండి నిందితులను అదుపులోకి తీసుకుని చోడవరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారని తెలియజేశారు. మధ్యవర్తుల సమక్షంలో విచారణలో, నిందితులు ఇద్దరూ నేరాన్ని అంగీకరించి, హెడ్ వార్డర్‌పై దాడి చేసిన విషయం, పారిపోవడానికి చేసిన ప్రణాళిక, మొబైల్ దొంగతనం విషయాలను ఒప్పుకున్నారన్నారు. వీరికి బెయిల్ వచ్చినప్పటికీ జామీను దొరకకపోవడం, హెడ్ వార్డర్ వీర్రాజుపై వ్యక్తిగత పగ (డి.ఎల్.ఎస్.ఏ) బెయిలు దరఖాస్తు పంపించకపోవడం వల్లను, ఏ3 ఏక స్వామి ప్రేరేపణ, కుట్రే వీరు తప్పించుకోవడానికి కారణాలని అంగీకరించినట్లు తెలియజేశారు. దీంతో ఏ3 ఏక స్వామిని కూడా ఈ కేసులో నిందితుడిగా చేర్చామని, దొంగిలించిన వివో ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ ఏ.2 బెజవాడ రాము నుండి స్వాధీనం చేసుకొని, పంచనామా ప్రకారం సీజ్ చేశామన్నారు. ఇద్దరు నిందితులను 06.09.2025న క్రైమ్ నెంబర్.192/2025 యు/ఎస్ 109(1), 331(5), 305(ఏ) , 262 ఆర్/ డబల్యూ 3(5), 61, 49, 132, 121(1), బి.ఎన్.ఎస్ యాక్ట్ ప్రకారం చోడవరం పోలీస్ స్టేషన్లో అధికారికంగా అరెస్టు చేసి, న్యాయస్థానానికి రిమాండ్‌కు హాజరుపరిచామని తెలిపారు. విశాఖపట్నం సిటీ టాస్క్ ఫోర్స్ పోలీసులు మరియు అనకాపల్లి జిల్లా పోలీసులు, అలాగే అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పీ ఎం.శ్రావణి, చోడవరం ఇన్స్పెక్టర్ పి.అప్పలరాజు, చోడవరం ఎస్సై బి.కార్తీక్, సిబ్బంది సమన్వయంతో 24 గంటల్లో సబ్ జైలు నుండి పారిపోయిన నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలియజేశారు. మీడియా సమావేశంలో అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పీ ఎం.శ్రావణి, చోడవరం ఇన్స్పెక్టర్ పి.అప్పలరాజు, చోడవరం ఎస్సై బి.కార్తీక్ జిల్లా సబ్ జైల్ ఇన్చార్జి అధికారి డి.రాజు తదితరులు పాల్గొన్నారు.